క్లుప్తంగా...

22 నుంచి 'సెల్ట్' తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో కొనసాగుతున్న ఇంగ్లిష్ శిక్షణ కేంద్రం (సెల్ట్)లో ఈ నెల 22 నుంచి తర గతులు ప్రారంభంకానున్నట్లు డైరెక్టర్ ప్రొ.సవీన్ బుధవారం తెలిపారు. రెండు నెలల పాటు కొనసాగే శిక్షణకు పది ఆపైన విద్యార్హతలు గల అభ్యర్థులు ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 7989903001 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విదేశీ విద్యార్థుల నిధుల దుర్వినియోగం

- విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో విదేశీ విద్యార్థుల నిధులను వీసీ ప్రొ.రవీందర్ దుర్వినియోగం చేసినట్లు లింగ్విస్టిక్స్ విభాగం మాజీ హెడ్, విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీ ఆరోపించారు. ప్రస్తుతం ఓయూ వీసీగా కొనసాగుతున్న ప్రొ.రవీందర్ 2017–2021 వరకు ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా పదవిలో కొనసాగిన సమయంలో విదేశీ విద్యార్థుల నుంచి ఫీజుల రూపేన మంజురైన రూ.94 లక్షల నిధులను ఆయా విభాగాలకు అందజేయకుండా రూ.71 లక్షలను దారి మళ్లించినట్లు ఆధారాలు తమ వద్ద ఉన్నాయని అన్సారీ వివరించారు. ఆర్ట్స్ కాలేజీలోని లింగ్విస్టిక్స్ విభాగానికి అత్యధికంగా రావలసిన రూ.10 లక్షలను ఇవ్వలేదన్నారు. విదేశీ విద్యార్థుల నిధుల దుర్వినియోగం గవర్నర్ తమిళిసై, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు ఉన్నత విద్య ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. వివరించారు. నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించి వీసీ ప్రొ.రవీందర్ పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ఖజానా నుంచే వేతనాలు చెల్లించాలి

- టీఏయూసీటీఏ జేఏసీ చైర్మన్ డాక్టర్ రామేశ్వర్‌రావు వినతి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఖజానా నుంచే వర్సిటీల అధ్యాపకుల వేతనాలు చెల్లిస్తున్నందున తమ ఉద్యోగాలను కూడ రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ (టీఏయూసీటీఏ) జేఏసీ చైర్మన్ డాక్టర్ రామేశ్వర్ రావు, కన్వీనర్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ సీఎం కేసీఆర్‌ను కోరారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట టీఏయూసీటీఏ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ సీఎం కేసీఆర్‌ను వేడుకున్నారు. జూనియర్, డిగ్రీ, వృత్తి విద్యా కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉద్యోగాలను రెగ్యులర్ చేసి వర్సిటీ అధ్యాపకులను విస్మరించడం అన్యాయమన్నారు. ఎక్కడ పనిచేసినా అధ్యాపక ఉద్యోగాలకు ఒకే అర్హతలని, వేతనాలు కూడ ప్రభుత్వం చెల్లిస్తున్నందున వర్సిటీల అధ్యాపకులను వేరుగా చూడటం ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 వర్సిటీలలో అనేక ఏండ్లుగా తక్కువ వేతనానికి పని చేస్తున్న 1335 మంది కాంట్రాక్టు అధ్యాపకుల పై కనికరం చేపి సీఎం కేసీఆర్ గతంలో అనేసార్లు ఇచ్చిన హామి మేరకు రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రేష్మారెడ్డి, విజేందర్, వాణి, ఉషశ్రీ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడితోనే రక్తపోటు

చిక్కడపల్లి: ఒత్తిడితోనే రక్తపోటు పెరుగుతోందని ప్రముఖ వైద్యులు నాగేశ్వరి అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా బుధవారం అశోక్‌నగర్‌లోని డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో సెమినార్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రక్తపోటును ఖచ్చితంగా కొలవడం వల్ల నియంత్రించుకోవచ్చన్నారు. ప్రపంచవ్యాప్తంగా రక్తపోటుపై తక్కువ అవగాహన ఉందన్నారు. విద్యార్థి దశలో రక్తపోటు బాగా పెరుగుతోందని దీన్ని అదుపులో ఉంచుకోకపోతే శారీరక, మానసిక సమస్యలు పెరుగుతాయన్నారు. పి.స్వరూపరాణి, జి.కృష్ణవేణి, గుజరాత్ రక్ష యూనివర్సిటీ ఫ్యాకల్టీ హిప్నో సరోజారాయ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

కాచిగూడ: పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా అందించే వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం కాచిగూడ డివిజన్ చెప్పల్‌బజార్, ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు, రోగనిరోధక శక్తి పెరిగేందుకు టీకాలు వేయించాలని సూచించారు. డాక్టర్ మనోజ్‌రెడ్డి, డాక్టర్ పద్మజ, నర్సుబాయి, ఇందిర, అనురాధ, సబిత, తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మీయత'ను పంచరా..?

బీఆర్‌ఎస్‌లో గ్రూపు తగాదాలు

- నిర్వహించలేకపోతున్న ఆత్మీయ సమ్మేళనాలు
- చేతులెత్తేసిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: బీఆర్‌ఎస్‌లో గ్రూపు తగాదాలను నివారించి నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం చేసుకుంటూ రానున్న అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేసే దిశలో అధిష్టానం ఓ బృహత్తర పథకాన్ని ఆత్మీయ సమ్మేళనాల పేరుతో అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే ఏ గ్రూపు తగాదాలను నివారించాలని ఈ కార్యక్రమం తలపెట్టారో ఆ గ్రూపు తగాదాలతోనే ఖైరతాబాద్ నియోజకవర్గంలో కొన్ని డివిజన్లలో ఇప్పటి వరకు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించలేక ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేతులెత్తేశారు.

- కొన్ని డివిజన్లలో ఎమ్మెల్యేకు, కార్పొరేటర్లకు పొసగక, మరికొన్ని డివిజన్లలో నేతల మధ్య విభేదాలు, ఇంకొన్ని చోట్ల ఎమ్మెల్యేలకు సానుకూల వాతావరణం లేకపోవడంతో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించలేదు.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్లు ఉండగా ప్రతి డివిజన్‌లో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ డివిజన్లలో ఇప్పటిదాకా వాటి ఊసే ఎత్తడం లేదు.
- ఇప్పటి వరకు కొన్ని డివిజన్లలో జరిగిన ఆత్మీయ సమ్మేళనాలు అంతగా విజయవంతమైనట్లుగా కనిపించడం లేదు. ఎప్పటికప్పుడు ఆత్మీయ సమ్మేళనాలపై నియోజకవర్గాలు ప్రభుత్వానికి నివేదిక అందిస్తుండగా ఖైరతాబాద్‌లో ఈ సమ్మేళనం అంత ఉత్సాహంగా, సానుకూల వాతావరణంలో జరగలేదని మంత్రి కేటీఆర్‌కు నివేదికలు వెళ్లాయి. ఇంకా రెండు డివిజన్లలో నిర్వహించాల్సిన సమ్మేళనాలు అటకెక్కాయి.
- బంజారాహిల్స్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కార్పొరేటర్‌గా ఉన్నారు. ఇక్కడ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయలేదు.
- జూబ్లీహిల్స్ డివిజన్‌లో మూడు, నాలుగు గ్రూపులు బీఆర్‌ఎస్‌లో వేరు కుంపట్లు పెట్టాయి. ఇక్కడ ఆత్మీయ సమ్మేళనం అంటే అంత తేలిక కాదని నిర్ణయించుకున్న ఎమ్మెల్యే దాని ఊసే ఎత్తడం లేదు. ప్రతి డివిజన్‌లోనూ బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య సఖ్యత కుదరడం లేదు.
- ఇప్పటికే ఇద్దరు, ముగ్గురు రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు తమదేనంటూ ప్రచారం చేసుకుంటుండటంతో కార్యకర్తలు ఎవరిని నమ్మాలో తెలియకుండా ఉంది.
- పార్టీ శ్రేణులు అన్నింటినీ కలుపుకొని పోవాల్సిన ఎమ్మెల్యే దానం ఆ దిశలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- నియోజకవర్గంలో ఆత్మీయ సమ్మేళనాలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడంతో అధిష్టానం తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు కూడా విశ్వసనీయ సమాచారం. ఈ వర్గ విభేదాలు ఎన్నికల నాటికి సమసిపోకపోతే ఈ అవకాశాన్ని కాంగ్రెస్, బీజేపీలు సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాయని స్వయంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలే వాపోతున్నారు.

ఎమ్మెల్యే సారు బిజీగా ఉన్నారు...

- అందుకే డివిజన్ పర్యటనకు నేనొచ్చా
- ఎమ్మెల్యే దానం పీఏ చంద్రశేఖర్



హిమాయత్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పీఏ చంద్రశేఖర్, అధికారులు

హిమాయత్‌నగర్: 'ఎమ్మెల్యే దానం నాగేందర్ సార్ చాలా బిజీగా ఉన్నారు. అందుకే డివిజన్ పర్యటనకు నేను హాజరయ్యాను' అని ఎమ్మెల్యే పీఏ చంద్రశేఖర్ అన్నారు. పీఏ చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలపై స్థానికులు అవాక్కయ్యారు. బుధవారం హిమాయత్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు యాదగిరి నేతృత్వంలో జీహెచ్‌ఎంసీ ఈఈ పేర్రాజుతో కలసి పీఏ చంద్రశేఖర్ పర్యటించారు. స్ట్రీట్ నెంబర్–2లో డ్రైనేజీ సమస్య ఉండటంతో ఇక్కడ పైప్‌లైన్ మంజూరైంది. ఈ పైప్‌లైన్ పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో పీఏకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇదే ప్రాంతంలో కరెంట్ పోల్‌ను రీప్లేస్ చేయాలని కోరారు. భగ్గీఖానా, స్ట్రీట్ నెంబర్–4లోని పూర్తిగా ధ్వంసమైన రోడ్లను త్వరితగతిన మరమ్మతులు చేయాలని ఈఈ పేర్రాజును పీఏ చంద్రశేఖర్ కోరారు. స్థానికులు, నాయకులు తన దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యనూ ఎమ్మెల్యే దానంకు వివరించి సత్వరమే పరిష్కరించేలా కృషి చేస్తానంటూ పీఏ చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే దానం రావాల్సిన పర్యటనలో ఆయన పీఏ రావడం సర్వత్రా చర్చనీయాంశం అయ్యింది.

బాక్సింగ్‌లో వర్షిత సత్తా



వర్షితను అభినందిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన వర్షితను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. బన్సీలాల్ పేటకు చెందిన వర్షిత ఈ నెల 13,14 తేదీల్లో షేక్‌పేటలో యూత్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడమే కాకుండా వచ్చే నెలలో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. బుధవారం వర్షిత, తన తల్లి సుచిత్ర, కోచ్ మనోజ్‌రెడ్డిలతో వెస్ట్ మారేడ్‌పల్లిలోని మంత్రి నివాసంలో ఆయనను కలువగా వర్షితను అభినందించి మాట్లాడారు. జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పాత్రికేయులు

చిలకలగూడ : పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18 (నేడు) వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని టీడబ్ల్యూయూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. హెచ్‌యూజే ఆధ్వర్యంలో సికింద్రాబాద్ సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తానని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం, రాజశేఖర్, జగదీష్, బీవీఎస్ పద్మరాజు, చంద్రశేఖర్, రేనయ్య, జీవన్‌రెడ్డి, ప్రతాప్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని బహుజన సమాజ్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు రుద్రవరం సునీల్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్యేక తెలంగాణతో జర్నలిస్ట్ కుటుంబాలు బాగుపడతాయని నమ్మిన పాత్రికేయులంతా ఉద్యమంలో పాల్గొని తమవంతు సహాయ సహకారాలు అందించారని గుర్తు చేశారు.

రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు



వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

చిలకలగూడ : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో రైల్వే పోలీసులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ డీఎస్పీ నర్సయ్య నేతృత్వంలో ఫింగర్ ప్రింట్ మెషిన్ ద్వారా పలువురి వేలిముద్రలను సేకరించి సరిపోల్చుకున్నారు. నేరాలను నియంత్రించి, రైల్వే ప్రయాణికులకు సంపూర్ణ భద్రత కల్పించేందుకు తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సంబంధిత రైల్వే అధికారులు తెలిపారు. ప్లాట్‌ఫాంలతో పాటు రైల్వేస్టేషన్ ప్రాంగణంలో నిర్వహించిన తనిఖీల్లో ఎవరూ అనుమానితులు లేరని సీఐ శ్రీను, ఎస్‌ఐ మజీద్, తెలిపారు.

ఆధునిక హంగులతో కుట్టివెల్లోడీ ఆస్పత్రి

- తాత్కాలికంగా మెట్టుగూడ ఆర్టీసీ భవనంలోకి మార్పు
- భవన నిర్మాణానికి రూ.12.75 కోట్లు మంజూరు
- డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



సంబంధిత అధికారులతో చర్చిస్తున్న పద్మారావుగౌడ్

చిలకలగూడ : సీతాఫల్‌మండి కుట్టివెల్లోడీ ఆస్పత్రిని మెట్టుగూడ ఆర్టీసీ భవనంలోకి తాత్కాలికంగా తరలించి, ఆస్పత్రి నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నట్లు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తెలిపారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత ఇంజినీర్లు, వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన కుట్టివెల్లోడీ ప్రభుత్వ ఆస్పత్రి స్థానంలో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.12.75 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుత ఆస్పత్రిని మెట్టుగూడలోని ఆర్టీసీ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, రవాణా మంత్రి, ఆర్టీసీ చైర్మన్, సీఎండీలతో పలుమార్లు చర్చించగా వారు అంగీకరించారని వివరించారు. కుట్టివెల్లోడి ఆస్పత్రి పక్కనే ఉన్న అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వేరే చోటికి తరలించి, నూతన భవన నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం నూతన ఆస్పత్రి భవన నిర్మాణం, ఆధునిక హంగులు, అత్యాధునిక వైద్యయంత్రాలు, వైద్యసేవలు, శస్త్ర చికిత్సలు, ప్రసూతి సేవలు తదితర అంశాలపై చర్చించి, బ్లూప్రింట్లను పరిశీలించారు. నిరుపేదలకు వైద్యసేవల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. ఆస్పత్రి నూతన భవన సముదాయాల నిర్మాణ పనులను ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. వైద్యాధికారి సక్కుబాయితోపాటు వివిధ వైద్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది, వైద్యవిధాన పరిషత్ అధికారులు, ఇంజినీర్ల బృందం పాల్గొన్నారు.

యూరాలజీ వైద్యుల అరుదైన చికిత్స

సాక్షి, సిటీబ్యూరో: వృషణాలు మెలితిరిగి, తీవ్రమైన నొప్పితో బాధ పడుతున్న 18 ఏళ్ల యువకుడికి నగరంలోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) వైద్యులు చికిత్స చేసి ఊరట కల్పించారు. అంతేకాకుండా అతను ఓ వృషణం కోల్పోకుండా కాపాడారు. సికింద్రాబాద్ ఏఐఎన్‌యూకు చెందిన కన్సల్టెంట్ యూరాలజిస్టులు డా.రాఘవేంద్ర కులకర్ణి, డా.సూరజ్ పిన్ని తెలిపిన వివరాల ప్రకారం..నగర యువకుడికి తొలుత ఎడమ వృషణం, గజ్జల్లోను నొప్పి రావడంతో ఏఐఎన్‌యూకు తీసుకొచ్చారు. పరీక్షలు చేస్తే కొద్దిపాటి సమస్య తప్ప అన్నీ సాధారణంగానే ఉన్నాయి. కానీ, ఎడమ వైపు ఎపిడైడిమిస్ మాత్రం బాగా లావుగా కనిపించింది. ఇంటర్మిటెంట్ టెస్టిక్యులర్ టోర్షన్ (ఐటీటీ) ఉంటుందన్న అనుమానాన్ని చెప్పి, శస్త్రచికిత్సే పరిష్కారమని వైద్యులు చెప్పారు. అయితే అప్పటికి వెళ్లిపోయిన వారు.. నాలుగు రోజుల తర్వాత నొప్పి బాగా ఎక్కువ కావడంతో యువకుడిని మళ్లీ ఏఐఎన్‌యూకు తీసుకొచ్చారు. అప్పుడు ఆ యువకుడి ఎడమవైపు అండకోశంలో నీరు బాగా చేరినట్లు వైద్యులు గుర్తించారు మరిన్ని పరీక్షల తర్వాత వృషణాలకు రక్తాన్ని సరఫరా చేసే స్పెర్మాటిక్ కార్డ్ మెలితిరిగిందని, దానివల్ల వృషణాలు కూడా మెలికపడ్డాయని తేలింది. దీంతో వెంటనే ఆ యువకుడికి శస్త్రచికిత్స చేశారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం



పనులకు శంకుస్థాపన చేస్తున్న రామకృష్ణ

రసూల్‌పురా: దశలవారీగా సమస్యలకు పరిష్కారం చూపుతామని బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ హామీ ఇచ్చారు. కంటోన్మెంట్ బోర్డు రెండవ వార్డు ఇందిరమ్మనగర్ శివాజీ గల్లీలో నూతనంగా భూగర్భ డ్రైనేజీ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. గతంలో బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా స్థానికులు డ్రైనేజీ సమస్య తన దృష్టికి తీసుకువచ్చారని దీంతో నూతనంగా డ్రైనేజీ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత సీసీ రోడ్డు పనులను చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం కృష్ణానగర్ కట్టమైసమ్మ బస్తీలో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాంసన్‌రాజు, రవికుమార్, మల్లేష్, చిలుకయ్య, మమత పాల్గొన్నారు.


కాంగ్రెస్ విజయం ఖాయం



అనిల్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రామ్‌కుమార్

రసూల్‌పురా: కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా (డీసీసీ) అధ్యక్షుడిగా ఎం. అనిల్‌కుమార్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ నియోజకవర్గం సీనియర్ నాయకులు ప్యారసాని రామ్‌కుమార్, గ్రేటర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బద్దం బల్వంత్‌రెడ్డి అనిల్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సికింద్రాబాద్ జిల్లా పరిధిలోని పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని అనీల్‌కుమార్ అన్నారు.

లాలాపేట: సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన ఎం. అనీల్‌కుమార్ యాదవ్‌ను బుధవారం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు కిషోర్ యాదవ్, అడ్వొకేట్ నూతన్ క్రాంతి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



నిమ్స్‌లో సుదీర్ఘ కాలం తర్వాత పదోన్నతులు

డైరెక్టర్ బీరప్పకు కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగులు



డైరెక్టర్‌కు ధన్యవాదాలు చెబుతున్న ఉద్యోగులు

లక్డీకాపూల్: నిమ్స్‌లో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ఫైల్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తన్నీరు హరీష్‌రావు చొరవతో ఇది సాధ్యమైంది. నిమ్స్ డైరెక్టర్‌గా డాక్టర్ నగరి బీరప్ప బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే రోగులకు మెరుగైన సేవలను అందించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కూడా తన వంతు కృషిని అందిస్తున్నారు. అందులో భాగంగానే ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులపై దృష్టి పెట్టిన ఆయన పలువురు ఉద్యోగులకు అవకాశం కల్పించారు. స్టోర్స్ సెక్షన్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ స్వామి, ప్లానింగ్ సెక్షన్ సూపరింటెండెంట్ సుజాతలతో పాటు ఆరుగురికి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి కల్పించారు. కృపారాణి, నిమ్స్ నాన్ ఫ్యాకల్టీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సత్యగౌడ్‌లకు అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ అధికారులుగా, మరో ఇద్దరు ఫార్మసిస్టులకు పదోన్నతి కల్పించారు. ఒకరికి సీనియర్ టెక్నికల్ అధికారిగా, ఇద్దరికి టెక్నికల్ అధికారులుగా పదోన్నతులు కల్పించారు. ఈ నేపథ్యంలో బుధవారం గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పొట్టభర్తిని రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిమ్స్ డైరెక్టర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రాజ్ కుమార్ మాట్లాడుతూ... డాక్టర్ బీరప్ప డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి దఫాలో పారదర్శకంగా 17 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారన్నారు. నిమ్స్ తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజ్ కుమార్, శ్రీనివాస్ రావు, ఎ. శ్రీనివాస్ రావు, అంజలి హర్షం వ్యక్తం చేశారు.

ఓయూలో కలేకూరి ప్రసాద్ వర్ధంతి



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక విప్లవకారుడు కలేకూరి ప్రసాద్ వర్ధంతిని బుధవారం ఓయూలో ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలేకూరి ప్రసాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి దళిత బహుజనుల చైతన్యానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంసా ఓయూ అధ్యక్షులు సామ సైదులు, విద్యార్థి నేతలు సురేష్, నవీన్, రాజేష్, సుధాకర్, మహేష్, రఘు, శివ, రఫీ, సతీష్, నగేష్, వంశీ పాల్గొన్నారు.

సంపాదించినదానిలో కొంత దానం చేస్తే ఎంతో సంతృప్తి

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్



పంజగుట్ట: మనం సంపాదించిన దాంట్లో కొంత దానం చేయడంలో ఉన్న సంతృప్తి దేనిలోనూ ఉండదని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. ఆర్ట్ ఆఫ్ గివింగ్ సంస్థ 10వ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా హెల్పింగ్ ది హెల్ప్‌లో భాగంగా నగరంలోని 25 ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం రాత్రి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి, ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, మత్స్య సహకార సంఘాల సొసైటీ చైర్మన్ పిట్టల రవీందర్, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి రవికాంత్‌రెడ్డిలతో కలిసి విశేష సేవలందించిన వివిధ ప్రాంతాలకు చెందిన అంగన్వాడీ టీచర్లను, ప్రెస్‌క్లబ్ సిబ్బందికి సన్మానించారు. సమావేశంలో చంద్రక్క, రాజారమేష్, నటరాజ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని నిరసన

కవాడిగూడ: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్ చరణ్‌సింగ్ పార్లమెంట్ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని అఖిల భారత శాంతి సంఘీభావ జాతీయ కార్యవర్గ సభ్యులు దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద రెజ్లర్లు తమకు న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న క్రమంలో వారికి సంఘీభావం తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రెజ్లర్ల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించకుండా వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి గురుబందన్‌సింగ్, వాజీద్, సుధాకర్, ప్రేమ్ పావని, మంజుశ్రీ, రాజశ్రీ, రాములుయాదవ్, వేణు, గోవింద్, జావేద్, రాంచందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



చిలకలగూడ: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఘట్‌కేసర్, బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య ఓ వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీమార్చురీకి తరలించారు. మృతుని వయసు సుమారు 35 ఏళ్లు ఉంటుందని ఛాతీపై పుట్టుమచ్చ ఉందని, సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులకు ఆశ్రయించాలన్నారు.

మరో ఘటనలో ఉత్తరప్రదేశ్ వాసి..

చిలకలగూడ: రైలు ఢీకొని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శరద్‌మౌర్య (20) ఓ కాంట్రాక్టర్ వద్ద ఏసీ కోచ్ అటెండర్‌గా పనిచేస్తూ బోయిగూడలో తోటి సిబ్బందితో కలిసి నివసిస్తున్నాడు. గంజాయి, మద్యానికి అలవాటు పడిన శరద్‌మౌర్య మంగళవారం రాత్రి స్థానిక ఓ వైన్స్‌లో మద్యం తాగాడు. సికింద్రాబాద్ ఆర్‌ఆర్‌ఐ సమీపంలో వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు బుధవారం డయల్ 100కు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. గుర్తింపు కార్డు ఆధారంగా శరద్ మౌర్యగా గుర్తించి మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని పోలీసులు తెలిపారు.

గృహిణి అదృశ్యం



ఎం. లక్ష్మి

లాలాపేట: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్– 8 జేఎస్‌ఎన్ కాలనీకి చెందిన ఎం.లక్ష్మీ (55) ఈ నెల 10న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో బుధవారం కుమారుడు శ్రీధర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లక్ష్మీ గత కొంత కాలంగా మతిస్థిమితం సరిగ్గా లేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379